సాక్షి ఒడిశా

శనివారం । 18 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,88,606లు, బంగారం 1 గ్రాము 550 మిల్లీగ్రాములు, వెండి 257 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సింగపూర్ స్నేహ బంధంలో.. సరికొత్త అధ్యాయం

రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్‌తో రాష్ట్ర ప్రభుత్వం మైత్రి బంధాల్ని బలోపేతం చేసే దిశలో అడుగులు వేస్తుంది.

- IIలో▸

విజేతగా కోట్‌పాడ్ టీమ్

జయపురం: నవరంగపూర్ జిల్లా కరచమాల పంచాయతీ మినీ స్టేడియంలో జరిగిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్ టీమ్‌విజేతగా నిలిచింది. ఫైనల్‌లో జయపురం శ్రీకాంత ఎలెవెన్ టీమ్, కోట్‌పాడ్ టీములు బుధవారం తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో 3–1 తేడాతో కోట్‌పాడ్ ఛాంపియన్‌గా నిలిచింది.

న్యూస్‌రీల్

గణతంత్ర పరేడ్‌కు దేవస్మిత బెనియ



ఆహ్వానం అందుకున్న దేవస్మిత బెనియ

జయపురం: న్యూఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకల పరేడ్‌కు జయపురం విక్రమదేవ్ వర్సిటీ ఎన్‌సీసీ మహిళా వింగ్ సీనియర్ అండర్ ఆఫీసర్ దేవస్మిత బెనియకు రాష్ట్రపతి భవన్ నుంచి పిలుపు వచ్చింది. దీనిలో భాగంగా ఈనెల 19వ తేదీన ఆమె న్యూఢిల్లీ బయల్దేరనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రం నుంచి కేవలం ఆమె ఒక్కరికి మాత్రమే ఆహ్వానం రావడం విశేషం. ఆమెకు తోడుగా రాయగడ ఒడియా బాలికల ఎన్‌సీసీ బెటాలియన్ సీనియర్ జీసీఆర్ (గరల్స్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్) ప్రతిమ మింజ వెళ్లనున్నట్లు తెలిసింది.

గంజాయి సాగుపై ఉక్కుపాదం



గంజాయి మొక్కలను తగలబెడుతున్న దృశ్యం

రాయగడ: జిల్లాలో గంజాయి సాగుపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. దీనిలో భాగంగా గుడారి సమితి బండిలి అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగవుతున్న గంజాయి మొక్కలను పోలీసులు, ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులను నిర్వహించి ధ్వంసం చేశారు. సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి సాగవుతుందన్న సమాచారం మేరకు దాడులు చేపట్టారు. మొత్తం 36 వేల గంజాయి మొక్కలను ఈ దాడుల్లో ధ్వంసం చేసి వాటిని నిప్పుపెట్టి తగలబెట్టారు.

విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: పట్టణంలో దొంగతనాలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్‌లు అరికట్టేందుకు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించాలని అఖిల భారత భ్రష్టాచార వ్యతిరేక సంఘటన ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘటన ప్రతినిధులు జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మను గురువారం కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. నేరస్తులు, అసాంఘిక శక్తుల నుంచి ప్రజలను కాపాడాలన్నారు. ముఖ్యంగా కెనాల్ రోడ్డు, గాంధీ జంక్షన్ రోడ్డు, బైపాస్ రోడ్డు, జయనగర్, జిల్లా కేంద్రాస్పత్రి రోడ్డుల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత భ్రష్టాచార వ్యతిరేక సంఘటన జయపురం అధ్యక్షుడు పూర్ణచంద్ర పాఢి, మోహన మాఝి, నరసింగ నాయక్, బాబూరాయ్, చిటి గొమాంగో, పూర్ణచంద్ర మాఝి, రవీంద్ర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు



సీజ్ చేసిన డ్రమ్ములతో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: సమితిలోని కుములిపుట్ పంచాయతీ టంకుగుడ గ్రామ సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న మూడు నాటుసారా బట్టీలపై దాడులు జరిపినట్లు ఎక్సైజ్ అధికారి శుభ్రత్ కేశరీ హిరన్ తెలిపారు. దీనిలో భాగంగా 80 లీటర్ల నాటుసారాతో పాటు సారా వండేందుకు సిద్ధం చేసిన 2,300 లీటర్ల ఇప్ప ఊటను పారవేశామని వెల్లడించారు. పారవేసిన సారా, ఊట విలువ రూ.లక్షకు పైనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అదనపు సబ్ ఇన్‌స్పెక్టర్ బలరాం దాస్ నేతృత్వంలో సిబ్బంది పాల్గొన్నారు. ఎక్సైజ్ సిబ్బందిని చూసి అక్కడ నుంచి సారా తయారు చేసేవారు పరారయ్యారు. అలాగే దాడులు జరిపి వస్తున్న సిబ్బందికి తెలిపుట్ గ్రామ రహదారిలో ఒక వ్యక్తి నాటుసారా తీసుకెళ్తుండగా కనిపించడంతో అరెస్టు చేశారన్నారు. నిందితుడు తెలిపుట్ గ్రామానికి చెందిన త్రినాథ్‌గా తెలిపారు.


బైక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

రాయగడ: బైక్ చోరీ కేసులో సదరు పోలీసులు ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు ఐఐసీ కేకే బీకే కుహరోతెలిపారు. మంగళవారం ఎంఐ డివిజన్ కార్యాలయం ఎదుట రింకు శేఠి అనే వ్యక్తి బైకు చోరీకి గురైంది. ఎస్ఐ రుద్రమాధవ్ ముదులి దర్యాప్తు చేపట్టగా.. సీసీటీవీ ఆధారంగా మహాదేవ్ సతాని, ఎం.కళ్యాణ్‌లను నిందితులుగా గుర్తించారు. అరెస్టు చేసి బైకును స్వాధీనం చేసుకున్నారు.

పూరీ శ్రీమందిరం..

- గుట్కా, పాన్, మొబైల్ ఫోన్ల వినియోగం కట్టడి
- సిబ్బంది ఆస్తుల వివరాలు వెల్లడించాల్సిందే
- సంప్రదాయ వస్త్రధారణ తప్పనిసరి

ఉద్యోగులకు ఆంక్షలు



భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో జగన్నాథ ఆలయ సిబ్బందికి కఠినమైన నిబంధనలు ప్రవేశపెట్టారు. జవాబుదారీతనం, సామర్థ్యాన్ని పెంచే దక్షతతో విధి నిర్వహణ నియమావళిని కట్టుదిట్టం చేశారు. ఇటీవల పరిపాలనా సమీక్ష సందర్భంగా క్రమశిక్షణ, సాంస్కృతిక సమగ్రతను అమలు చేసే ప్రయత్నంలో సమగ్రంగా ఐదు అంశాల కార్యాచరణ ప్రణాళికను ప్రధాన పాలనాధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి వెల్లడించారు.

గుట్కా నిషేధం..

పని వేళల్లో పాన్, గుట్కా ఇతరేతర ఏదైనా మత్తు పదార్థాల వినియోగంపై నిషేధం విధించారు. పూరీ శ్రీ మందిరం నిర్వాహకులు, అధికారులు, ఉద్యోగులంతా తమ ఆస్తుల వివరాలను ఈ నెల 31లోగా దాఖలు చేయాల్సి ఉంటుంది. నిర్దేశిత గడువు లోగా ఆస్తి వివరాలు దాఖలు చేయడంలో విఫలమైతే వార్షిక జీతాల పెంపు, పదోన్నతులు, ఆర్థిక ప్రోత్సాహకాలు నిలిపివేయడం వంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

మూడో వారం సమీక్ష ..

అధికారులు, సిబ్బంది పనితీరును ప్రతి నెల క్రమం తప్పకుండా సమీక్షిస్తారు. నెలలో ప్రతి మూడో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సంప్రదాయ వస్త్ర ధారణ అధికారిక యూనిఫారం ధరించే వారు మినహా ఇతర సిబ్బంది, అధికారులు అందరూ ప్రతి శుక్రవారం సంప్రదాయ దుస్తులను ధరించాల్సి ఉంటుంది. విధుల నిర్వహణలో పరధ్యానాన్ని నివారించే ప్రయత్నంలో భాగంగా అధికారులు, ఉద్యోగులకు ఆలయ ప్రాంగణంలో మొబైల్ ఫోన్ల వినియోగం నిషేధించారు. ఈ మార్గదర్శకాలు మరింత చురుకైన, బాధ్యతాయుతమైన పరిపాలనను పెంపొందించడానికి ఉద్దేశించినట్లు సీఏఓ పేర్కొన్నారు.

పక్షుల లెక్కింపునకు మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ కార్యక్రమంలో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది

మల్కన్‌గిరి:మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సత్తిగూడ జలాశయంలో శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి ఆదేశాల మేరకు పక్షుల లెక్కింపునకు మాక్‌డ్రిల్ జరిగింది. 19వ తేదీ నుంచి పక్షుల లెక్కింపు జరుగుతుందని అధికారులు తెలిపారు. ఆరు మోటార్ బోట్‌లు, డ్రోన్ కెమెరాలు, ఆరు బృందాలతో జలాశయంలో పక్షుల లెక్కింపు నిర్వహిస్తారు.

కొత్త అల్లుడికి 67 రకాల వంటకాలు

రాయగడ: స్థానిక కేఎన్‌కే రోడ్డు సమీపంలో ఉన్న ఊన్న సూర్యనారాయణ, స్వప్న దంపతులు ఈ ఏడాది తమ కొత్త అల్లుడికి 67 రకాల వంటలతో విందుని ఏర్పాటు చేశారు. సంక్రాంతికి అల్లుడిని ఆహ్వానించిన ఈ దంపతులు వివిధ రకాల పిండి వంటలతో పాటు నాన్‌వెజ్, వెజ్, మిఠాయిలు తదితరమైన వంటలను పెట్టి అల్లుడిని ఆశ్చర్య పరిచారు. పట్టణంలో ఇటువంటి తరహాలో అల్లుడికి విందు ఇవ్వడం ఇదే మొదటిసారి కావడంతో అందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.



కొత్త అల్లుడికి వడ్డించిన వంటలు

మైకంచ్ పంచాయతీ సర్పంచ్‌పై దాడి

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి మైకంచ్ పంచాయతీ సర్పంచ్ మస్తారామ్ మాఝిపై దాడి జరిగింది. శనివారం సాయంత్రం ఈ మేరకు బాధితుడు సదరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఐఐసి కేకేబికే కుహోరా తెలియజేసిన వివరాల ప్రకారం.. మైకంచ్ సర్పంచు మాఝి పై స్థానిక సాయిల్ కన్జర్వేషన్ శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకుమార్ నాయక్ అతని సహచరుడు కలిసి దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. సమితి పరిధిలోని కరంజి, కుపాఖల్, కుటుజిరి, జిరిఖొల్ తదితర ప్రాంతాల్లో సిల్వర్ ప్లాంటేషన్ పనులు సాయల్ కంజర్వేషన్ శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. దీనికి సంబంధించి గత కొద్ది నెలలుగా కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించలేదు. ఈ క్రమంలో మాఝి ఆయా ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లను పట్టుకుని స్థానిక కన్జర్వేటర్ కార్యాలయానికి వెళ్లి బిల్‌లు చెల్లించని విషయాన్ని సంబంధిత శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లాడు. అయితే అదే సమయంలో విధుల్లో లేని కుమార్ ఈ విషయాన్ని తెలుసుకున్నాడు. అనంతరం వారంతా తిరిగి వెళుతున్న సమయంలో జూనియర్ ఇంజినీర్, తన సహచరుడు మార్గమధ్యమంలో కనిపించడంతో సర్పంచ్ మరి కొంతమంది కలిసి బిల్లుల విషయమై అడిగారు. అందుకు కోపగించుకున్న ఇంజినీర్ అతని సహచరులు దాడికి దిగారు. దాడిలో సర్పంచ్ గాయాలకు గురయ్యాడు. దీనిపై సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే తన పై సర్పంచు దాడి చేశాడని ఇంజనీర్ కుమార్ కూడా పోలీస్‌స్టేషన్‌లో సర్పంచ్‌పై కేసు పెట్టాడు.



గాయాలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సర్పంచ్

స్పెషల్ రైలు ప్రారంభించిన ముఖ్యమంత్రి



వృద్ధుల ఆధ్యాత్మిక ఆకాంక్ష సాకారం



యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న వయో వృద్ధుల తీర్థ యాత్ర స్పెషల్ రైలుని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి శుక్రవారం ప్రారంభించారు. భువనేశ్వర్ రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరింది. ఈ విడతలో వయో వృద్ధుల తీర్థ యాత్ర పథకం కింద షిర్డీ, నాసిక్‌లకు తీర్థయాత్ర రైలును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్థికంగా వెనుకబడిన, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వయో వృద్ధుల ఆధ్యాత్మిక, మతపరమైన ఆకాంక్షలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. విడతలో ఖుర్దా, పూరీ, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, ఢెంకనాల్ ఆరు జిల్లాల నుంచి 775 మంది వృద్ధులు మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన షిర్డీ, నాసిక్ క్షేత్రాలు సందర్శిస్తారని చెప్పారు.

ఈ ఏడాది విడతలవారీగా రాష్ట్రంలో సమగ్రంగా 8,000 మంది వృద్ధులకు షిర్డీ, నాసిక్, దక్షిణ కాళీ (కోల్‌కతా), కామాక్ష, అయోధ్య, వారణాసి తదితర ప్రాంతాలకు ఉచిత యాత్ర సౌకర్యం కల్పిస్తామన్నారు. 10 విడతలుగా స్పెషల్ రైలు నడుస్తుందన్నారు. త్వరలో మరో 2 విడతల్లో భువనేశ్వర్, బరంపురం, సంబల్‌పూర్, రాయగడ, బాలాసోర్ స్టేషన్ల నుంచి రెండు దశల్లో ఈ తీర్థయాత్ర రైలు బయలుదేరనుందని వివరించారు.

స్వగ్రామం నుంచి ఉచిత రవాణా..

యాత్రికులందరికీ స్వగ్రామం నుంచే ప్రయాణం ప్రారంభించి రైల్వే స్టేషన్ వరకు వచ్చేలా ప్రభుత్వం ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తుంది. యాత్రికులందరికీ బస, రైల్వే స్టేషన్ నుంచి యాత్రాస్థలికి రవాణా, భోజన, పానీయాల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపౌరుల మతపరమైన, ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రపంచ ప్రసిద్ధ మహా కుంభమేళా కోసం నాలుగు అత్యాధునిక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. దీంతో పాటు మహా కుంభమేళా కోసం ఒడిశా నుంచి ఏడు ప్రత్యేక రైళ్లను కూడా నడిపిస్తుందని తెలిపారు.

ప్రధాన న్యాయమూర్తికి వీడ్కోలు



జస్టిస్ చక్రధారి శరణ్‌సింగ్‌కు జ్ఞాపిక బహూకరించిన రాష్ట్ర గవర్నర్

భువనేశ్వర్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్‌సింగ్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక లోక్ సేవాభవన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాదరంగా వీడ్కోలు పలికారు. ఈయన ఈ నెల 19న పదవీ విరమణ చేయనున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పాల్గొన్నారు.

ధాన్యం కుప్పలు దగ్ధం

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి పూజారిగుడ పంచాయతీలోని పటాబొంధొ గ్రామంలో గల ధాన్యం కుప్పలు అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన పురేంద్ర కర్షిక, నరేంద్ర కర్షిక, ప్రశన్న గంతాయిత్, జయసింగ్ హుయిక, సునా కద్రక, కృష్ణ తడిక, లచ కద్రక, ముగురి కర్షక అనే రైతులకు చెందిన సుమారు 1500 క్వింటాళ్ల ధాన్యం మంటలకు పూర్తిగా కాలిబూడిదయ్యింది. ఖరీఫ్ ధాన్యం కోతలు కొసిన వెంటనే వాటిని పంట పొలంలో 18 కుప్పలుగా వేసి రైతులు అమ్మకానికి సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలో గల వారు రైతులకు సమాచారం అందించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రానికి తెలియజేయడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ధాన్యం కుప్పలు పూర్తిగా కాలిపోయాయి. అగ్రి ప్రమాదం సమాచారం తెలుసుకున్న పూజారిగుడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర ఆచార్య, నమిత రాణి గొమాంగొలు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత రైతుల నుంచి వివరాలు సేకరించారు. అగ్ని ప్రమాద విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ప్రమాదంలో నష్టాల వివరాలను రైతుల నుంచి సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



సంఘటన స్థలంలో బైక్



ప్రమాద స్థలంలో గాయపడిన వ్యక్తి



ప్రమాదానికి కారణమవుతున్న రహదారి

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి తెంతులిగూఢ గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తెంతులిగూడ సమీపంలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీని వల్లనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

వ్యూ పాయింట్ వద్ద యువకుని మృతదేహం లభ్యం

రాయగడ: సదరు సమితి బాయిసింగి పంచాయతీ పరిధిలోని దుమ్మాగుడ సమీపంలో గల వ్యూ పాయింట్‌కు సమీపంలో ఒక యువకుని మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతుడిని కాశీపూర్ సమితి గౌరఖ్‌పూర్ పంచాయతీలోని పటముండ గ్రామానికి చెందిన పవిత్ర నాయక్ (22)గా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు. సదరు పోలీస్ స్టేషన్ ఐఐసీ కెకెబికే కుహరొ తెలియజేసిన వివరాల ప్రకారం.. ఆదివారం దుమ్మాగుడలో గల వ్యూపాయింట్ సమీపంలో కొండపై ఒక యువకుని మృతదేహం పడి ఉందని సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహం పక్కనే ఒక మనీ పర్సుతో పాటు క్రిమిసంహారక మందు బాటిల్ పడి ఉండటంతో.. ప్రాథమిక దర్యాప్తులో యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే తన కొడుకు ఆత్మహత్య చేసుకొని ఉండడని, ఎవరో హత్య చేసి ఉంటారని మృతుని కుటుంబీకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యువకుని మృతదేహం

క్లుప్తంగా

నేడు రాయగడలో సీఎం పర్యటన


ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

రాయగడ: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి శనివారం రాయగడలో పర్యటించనున్నారు. ఉదయం 11.05 గంటలకు గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగి సమీపంలోని బిజు పట్నాయక్ ఆడిటోరియానికి వెళతారు. మధ్యాహ్నం 12.05 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రసంగిస్తారు. స్వమిత్వా యోజనలో భాగంగా వర్చువల్‌గా దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే ప్రత్యేక కార్యక్రమాన్ని వీక్షిస్తారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి మజ్జిగౌరి మందిరానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు.

సలిబి పాఠశాలలో బీఈఓ దర్యాప్తు


వివరాలు సేకరిస్తున్న బీఈఓ మంజులత

రాయగడ: పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు వన భోజనాలకు వెళ్లి వచ్చిన సంగతి జిల్లా విద్యాశాఖ దృష్టికి రావడంతో అధికారులు దర్యాప్తు చేపట్టారు. కొలనార సమితిలోని రేఖాపాదొరొ పంచాయతీ సలిబి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుందన్న ఫిర్యాదు మేరకు బీఈఓ మంజులత జెన్న శనివారం పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నివేదికను విద్యాశాఖ అధికారికి అందజేస్తానని తెలిపారు.

ఏబీవీపీ కార్యాలయం ప్రారంభం


ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సీతారాం ప్రధాన్

పర్లాకిమిడి: పట్టణంలోని రాజవీధిలో శ్రీశైలం ఫంక్షన్ హాలు సమీపంలో అఖిల భారత విద్యా పరిషత్ గజపతి జిల్లా కార్యాలయాన్ని న్యాయవాది సిద్ధేశ్వర మిశ్రా, ప్రిన్సిపల్ మనోజ్ పటాన్నయక్ శుక్రవారం ప్రారంభించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ అధ్యక్షుడు సీతారాం ప్రధాన్, జిల్లా ప్రముఖులు బాలకృష్ణ జెన్నా, సమీర్ పాణిగ్రాహి, ముఖలింగ పిడిక, దీపక్ మహాపాత్రో, చేతనా పాఢి పాల్గొన్నారు.

జస్టిస్ అరిందమ్ సిన్హాకు కీలక బాధ్యతలు

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ఆమోదం మేరకు రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరిందమ్ సిన్హా కార్యనిర్వాహక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ ఈ నెల 19న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో ఈ నెల 20 కార్య నిర్వాహక ప్రధాన న్యాయమూర్తి బాధ్యతల్ని జస్టిస్ అరిందమ్ సిన్హా నిర్వహిస్తారు.

విజయదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని నానుబాలవీధిలో వేంచేసిన విజయ దుర్గా దేవి ఆలయంలో పుష్యమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్, ఎఫ్ఎన్ఓ పోస్టుల భర్తీ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో ఉన్న పలు పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్-1 (కాంట్రాక్టు), ఎఫ్ఎన్ఓ-05 (ఔట్ సోర్సింగ్) పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లుగా డీఎంహెచ్ఓ బాలమురళీకృష్ణ తెలియజేశారు. ఈ మేరకు ఆసక్తి గత అభ్యర్థులు ఈనెల 22 లోగా డీఎంహెచ్ఓ కార్యాలయానికి సమర్పించాలని ఆయన కోరారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీ

జిల్లాలో వైద్యారోగ్య శాఖ పరిధిలోని ఎన్ఆర్‌హెచ్ఎం, జిల్లా జనరల్ ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల్లో పనిచేసేందుకు గాను మొత్తం ఆరు పోస్టులను భర్తీ చేస్తున్నట్టుగా డీఎంహెచ్ఓ బాలమురళీకృష్ణ ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు ఫిజీషియన్ - 01, మెడికల్ ఆఫీసర్ -02, క్లినికల్ సైకాలజిస్టు -01, ఆప్తమాలజిస్టు -01, డెంటల్ టెక్నీషియన్ -01 తదితర పోస్టులను భర్తీ చేయనున్నట్లుగా, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22 లోగా తమ దరఖాస్తులను డీఎంహెచ్ఓ కార్యాలయానికి పంపించాలని, మరిన్ని వివరాలకు శ్రీకాకుళం.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

సింగపూర్ స్నేహ బంధంలో..

సరికొత్త అధ్యాయం



రాష్ట్ర ముఖ్యమంత్రితో సింగపూర్ అధ్యక్షుడి సమావేశం

భువనేశ్వర్: రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్‌తో రాష్ట్ర ప్రభుత్వం మైత్రి బంధాల్ని బలోపేతం చేసే దిశలో అడుగులు వేస్తుంది. ఈ ప్రయత్నాలు ప్రాథమిక దశలో సత్ఫలితాలు ప్రదర్శిస్తున్నాయి. అధ్యక్షుడు ధర్మన్ నేతృత్వంలో సింగపూర్ అధికార ప్రతినిధి బృందం రెడు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేసింది. స్థానిక వరల్డ్ స్కిల్ సెంటర్‌లో సింగపూర్ ప్రెసిడెంట్ ధర్మన్ షణ్ముగరత్నం, ఆయన బృందంతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర మంత్రులు అధికారికంగా సంభాషించారు. ఈ చర్చలు ఆశాజనకంగా సాగి రాష్ట్రంతో అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసేందుకు మార్గం సుగమం చేసింది. ఒడిశా, సింగపూర్‌లు అంతర్జాతీయ సహకారంలో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించనున్నాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఒడిశా ప్రభుత్వం - సింగపూర్ మధ్య 8 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్ర పరిశ్రమలు, నైపుణ్యత అభివృద్ధి, సాంకేతిక విద్య, గృహ నిర్మాణం, నగరాభివృద్ధి, విద్యుత్ విభాగం సింగపూర్ ప్రభుత్వ విభాగాల మధ్య పలు ప్రాజెక్టులకు సంబంధించి అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాల ప్రక్రియ పూర్తయ్యింది.

అవగాహన ఒప్పందాలివే..

సెమీ కండక్టర్: రాష్ట్ర నైపుణ్యత అభివృద్ధి, సాంకేతిక విద్య (ఎస్‌డీటీఈ) - సింగపూర్ ఐటీఈఈ మధ్య ఒప్పందం

భవిష్యత్తు కోసం నైపుణ్యం: నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్య - ఐటీఈఈ మధ్య ఒప్పందం

ఇండస్ట్రియల్ పార్కులు: రాష్ట్ర పరిశ్రమల శాఖ - సెంబ్‌కార్ప్ మధ్య ఒప్పందం

గ్రీన్ హైడ్రోజన్ కారిడార్: రాష్ట్ర పరిశ్రమల శాఖ - సుబర్నా జురాంగ్ మధ్య ఒప్పందం

కొత్త నగర ప్రణాళిక: రాష్ట్ర గృహ నిర్మాణం- నగరాభివృద్ధి విభాగం - సుబర్నా జురాంగ్ మధ్య ఒప్పందం

పీసీపీఐఆర్: పరిశ్రమల శాఖ - సుబర్నా జురాంగ్ మధ్య ఒప్పందం

న్యూ ఎనర్జీ: రాష్ట్ర విద్యుత్ విభాగం - నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ మధ్య ఒప్పందం

ఫిన్‌టెక్: రాష్ట్ర ఎల్రక్టానిక్స్- సాంకేతిక సమాచారం - నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ మధ్య ఒప్పందం


సింగపూర్, ఒడిశా మధ్య అవగాహన ఒప్పంద పత్రాల సంతకాల కార్యక్రమం

ఈ అవగాహన ఒప్పందాలు రాష్ట్ర నైపుణ్య పర్యావరణ వ్యవస్థను మెరుగుపరిచి రాష్ట్రానికి 21వ శతాబ్దపు నైపుణ్య మానవ వనరుల రాజధానిని ఆవిష్కరిస్తాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో రాష్ట్రాన్ని భవిష్యత్తు నైపుణ్య కేంద్రంగా తీర్చిదిద్దే దృక్పథంతో సింగపూర్‌లో పలు ఒప్పందాలు కుదిరాయని పేర్కొన్నారు.

సింగపూర్ అధ్యక్షుడికి ఘన స్వాగతం


ధర్మన్‌కు స్వాగతం పలికిన సీఎం, కేంద్ర మంత్రి

భువనేశ్వర్: రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ ఎస్‌కు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, హోం శాఖ ప్రముఖ కార్యదర్శి, రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ వై.బి.ఖురానియా తదితరులు హాజరై స్వాగతం పలికారు. సింగపూర్‌తో స్నేహం, సహకార బంధాలను బలోపేతం చేసే దిశలో అధ్యక్షుడి పర్యటన ఫలప్రదం అవుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

భక్తులకు మౌలిక సదుపాయాలపై దృష్టి

జయపురం : రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన శివాలయాల్లో ఒకటైన జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర్‌లో శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు శివరాత్రి పరిచాలన కమిటీ నిర్ణయించింది. గురువారం జయపురం మున్సిపాలిటీ కార్యాలయ సభాగృహంలో సబ్ కలెక్టర్ కుమారి అక్కవరం శౌర్య రెడ్డి అధ్యక్షతన జరిగిన శివరాత్రి సన్నాహక సమావేశంలో ఫిబ్రవరి 26న జరుగనున్న మహాశివరాత్రి ఉత్సవాలలో గుప్తేశ్వర్ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. గుప్తేశ్వర్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు బొయిపరిగుడ, జయపురం సదర్ పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని సమావేశం సంబందిత అధికారులకు సూచించారు. ఎప్పటి లాగానే ఈ ఏడాది సివిల్ సప్లై అధికారులు రెండు స్టాల్స్ ఏర్పాటు చేసి బియ్యం, పప్పులు, కిరసనాయిలు ఇతర అత్యవసర దినుసులు భక్తులకు సమకూర్చాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. మహాశివరాత్రికి జయపురం, కొరాపుట్‌ల నుంచి 20 ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులు భక్తుల కోసం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గుప్తేశ్వర రోడ్లు, శౌచాలయ నిర్మాణ బాధ్యతలను ఆర్ అండ్‌బీ అధికారులకు అప్పజెప్పినట్లు వెల్లడించారు.

రోడ్డెక్కిన రైతులు


పర్లాకిమిడి ప్రాంతీయ మార్కెట్ కమిటీ వద్ద నిరసన చేస్తున్న రైతులకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పదిరోజులు కావస్తున్నా పంట కొనుగోలు చేయడం లేదని ఆందోళన చెందుతున్నారు. గుసాని సమితిలో ఉప్పలాడ, పర్లాకిమిడి, జంగాలపాడు, లావణ్యగడ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అనేక కొత్త నిబంధన వల్ల రైతులు నిరసిస్తున్నారు. శుక్రవారం ప్రాంతీయ మార్కెటింగ్ కమిటీ వద్దకు రైతులు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, సొసైటీల వద్ద కార్యదర్శి తనిఖీలు చేసిన అనంతరం మండీ వద్దకు ధాన్యం తీసుకురావాలని, ఇక్కడ నాలుగు రోజులు ఉంచినా మళ్లీ మిల్లుల వద్దకు తీసుకురావాలని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి రైతుల వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రఫుల్ల కుమార్ బెహరా, ఏడీఎం రాజేంద్ర మింజ్ వచ్చి రైతులకు నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అలాగే శుక్రవారం గుసాని సమితి జంగాల పాడు గ్రామంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

ఆమదాలవలసలో సినీ నటుల సందడి

ఆమదాలవలస: ఆమదాలవలస మండలం కొర్లకోటలో సినీనటులు సందడి చేశారు. గ్రామానికి చెందిన పేడాడ నర్సింగరావు, రమణికుమారిల కుమారులు దీపక్‌సరోజ్, సందీప్ సరోజ్‌లు సినీ నటులుగా చిన్ననాటి నుంచి రాణిస్తున్నారు. దీపక్ సరోజ్ అతడు, పోకిరి, లెజెండ్, ఆర్య, పౌర్ణమిలో చైల్డ్ ఆర్టిస్టుగా చేశాడు. రోటి కాపడా రొమాన్స్, కమిటీ కుర్రోళ్లు, మిణుగురులు సినిమాల్లో సందీప్ సరోజ్ హీరో క్యారెక్టర్‌తోపాటు సైడ్ హీరోగా క్యారెక్టర్‌లు చేశాడు. ప్రస్తుతం పలు సినిమాల్లో బిజీగా ఉన్న వీరిద్దరు పండగకు సొంత గ్రామానికి వచ్చారు. అలాగే ఆమదాలవలస మండలం శ్రీహరిపురం గ్రామంలో గల వారి బంధువులు రాజశేఖర్ కుటుంబసభ్యులతో శుక్రవారం కలిసి గడిపారు.

గోదాముల సామర్థ్యం పెంపే లక్ష్యం

పొందూరు: రాష్ట్రంలో స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న గోదాముల సామర్థ్యం పెంపు కోసం నూతన గోదాముల నిర్మాణం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర గిడ్డంగులు, గోదాముల సంస్థ ఎండీ జి.సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక స్టేట్ వేర్‌హౌస్ గోదాములను శుక్రవారం పరిశీలించారు. నూతన గోదాముల నిర్మాణానికి, కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందని చెప్పారు. ఆయనతో శ్రీకాకుళం రీజనల్ మేనేజర్ రాజశ్రీ, పొందూరు మేనేజర్ సునీత, అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్యే అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మల్కన్‌గిరి : జిల్లా కాంగ్రెస్ సభ్యులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మల్కన్‌గిరి జిల్లా సరిహద్దు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్మా కవాసిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని, ఆయన్ను వెంటనే విడుదల చేయాలని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో డిమాండ్ చేశారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా పనిచేసిన లక్మాపై తప్పుడు కేసులు పెట్టడం తగదన్నారు. అనంతరం ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద పాత్రో, పి.కేసురావు, జి.శ్రీనివాసరావు, భీమా బర్సే, మాలమాడీ, పద్మాపంగి, కృష్ణచంద్ర అనుగు, సరోజ్ పాత్రో పాల్గొన్నారు.

రాగుల మండీలు ప్రారంభం


మండీల్లో రాగులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఫట్వారి

రాయగడ: స్థానిక ఆర్ఎంసీ కార్యాలయ ప్రాంగణంలో కలెక్టర్ ఫరూల్ ఫట్వారి శుక్రవారం రాగుల మండీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా రైతుల నుంచి తీసుకు వచ్చిన రాగులను ఆమె పరిశీలించారు. ఈ ఏడాది 83,500 క్వింటాళ్ల రాగులను రైతుల నుంచి ఖరీదు చేసేదుకు లక్ష్యంగా ఉన్నట్లు ఆమె తెలియజేశారు.

మొదటిరోజు ఐదుగురు నుంచి 21 క్వింటాళ్ల రాగులను ఖరీదు చేశారు. ఇప్పటికే జిల్లాలోని 11,527 మంది రైతులు తాము పండించిన రాగులను విక్రయించేందుకు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

దివ్యాంగులను ప్రోత్సహిద్దాం: కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల్లో సృజనాత్మకత వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవితతో కలసి వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముందుగా రిజిస్ట్రేషన్ కౌంటర్ పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీసి పలు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకొని ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. స్వాభిమాన్ కార్యక్రమంలో డీపీఓ కె.భారతీసౌజన్య, జిల్లా ఉపాధి కల్పనాధికారిణి సుధ పాల్గొన్నారు.

ముద్దాయిలకు మౌలిక వసతుల కల్పనపై దృష్టి


జిల్లా జైలు సందర్శనలో కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎస్పీ, పలు శాఖల అధికారులు

గార: జైళ్లలో కుల ఆధారిత వివక్ష సంఘటనలపై అంచనా వేసేందుకు జిల్లా అధికారులు శుక్రవారం జిల్లాజైలును సందర్శించారు. అంపోలు పరిధిలోని జిల్లా జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పలు శాఖల అధికారులు సందర్శించారు. జైలులోని పరిసరాలను పరిశీలించి, అవసరమైన మౌలిక వసతులపై కల్పనపై దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. అన్ని అంశాల వారీగా తనిఖీలు చేశారు. మహిళా బ్యారెక్‌లో మహిళా ఖైదీలతో వారి వసతులపై ఆరా తీశారు. జైల్లో తాగునీరు, వైద్యంపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టీవీ బాలమురళీకృష్ణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య, సంక్షేమశాఖాధికారి వై.విశ్వమోహన్, ఎంప్లాయిమెంట్ అధికారి కె.సుధ, జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాధ స్వామి, జిల్లా పరిశ్రమలశాఖాధికారి జె.ఉమామహేశ్వరరావు, జైలు అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

జయపురం : జయపురంలో సంక్రాంతి సంబరాలు గురువారం రాత్రితో ముగిశాయి. అఖిల్ ఈవెంట్స్ రాంబాబు, రమేష్‌దాస్‌లు సంయుక్తంగా స్థానిక ప్రతాప్ టాకీసు ప్రాంగణంలో ఈ కార్యక్రమంలో తెలుగు సినీ నటుడు సిద్ధార్థ జి.రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమాజ సేవి దివంగత కార్తీక రౌత్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. మిస్ ఒడిశా హునా రాణి పట్నాయిక్, సినీ నటుడు మహమ్మద్ బాబుల్‌లను సన్మానించారు. హైదరాబాద్‌కు చెందిన గాయకులు నందిత జ్యోతి, షేక్ అభాష్, వీరాస్వామి చక్కగా గీతాలు ఆలపించారు. విశాఖకు చెందిన రోయల్ గ్రూపు కళాకారులు చేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గా ప్రసాద్ శర్మ, తులసీ దాస్, రవీంద్రనాథ్ పట్నాయిక్, సంతోష్ సాహు సహకరించారు. మల్కన గిరికి చెందిన నివేదిత మిశ్ర, విశాఖపట్నం జ్యోతి యాంకర్లుగా వ్యవహరించారు.


పర్లాకిమిడి: ప్రముఖులకు సన్మానం చేస్తున్న హైటెక్ చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి


జయపురం : మిస్ ఒడిశా హెనారాణి పట్నాయిక్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు


పర్లాకిమిడి: నాళం సీతారామస్వామి దంపతులను సన్మానిస్తున్న బాలాజీ


జయపురం : కళాకారుడిని సన్మానిస్తున్న దృశ్యం

పర్లాకిమిడిలో..

స్థానిక రాంనగర్ హైటెక్ ప్లాజాలో పరలా కళా సంస్కృతి ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలు ముక్కనుమతో ముగిశాయి. చివరి రోజు జబర్దస్త్ టీం షకలక శంకర్, శ్రీను, బృందం విచ్చేసి ప్రేక్షకులను అలరించారు. పలువురు కళాకారులను ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి సత్కరించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆడపడుచులకు పసుపు, కుంకుమ, చీరలను వాసవీ మాత సంక్రాంతి కానుకగా అందజేశారు. ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త నాళం సీతారామస్వామి (కుమార్) గజపతి చాంబర్స్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ అంధవరపు బాలాజీ దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. పర్లాకిమిడి పురపాలక సంఘం, మాజీ చైర్మన్ బబులా పట్నాయిక్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. డాక్టర్ రామారావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సామాజిక సంఘం సభ్యులంతా ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఒడిషా రాష్ట్ర ఆర్యవైశ్యం సంఘం కార్యదర్శి రవ్వా రామక్రిష్ణ పర్లాకిమిడి ఆర్యవైశ్య సంఘానికి ధన్యవాదాలు తెలిపారు.


భువనేశ్వర్ కళాకారుల గ్రూప్ డ్యాన్సు


పర్లాకిమిడి: హైటెక్ ప్లాజాలో మకర సంక్రాంతి వేడుకల్లో జబర్దస్త్ బృందం


జయపురం : ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


జయపురం : సంక్రాంతి సంబరాల నిర్వాహకులతో..

క్లుప్తంగా

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్‌డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్పీ స్వయంగా నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరిత గతిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

సర్వశిక్ష ఏపీసీగా రామారావు నియమకం

విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖకు సంబంధించి సర్వశిక్ష విభాగానికి అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ (ఏపీసీ)గా డాక్టర్ ఎ.రామారావును విద్యాశాఖ నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన వివిధ జిల్లాల సర్వశిక్ష ఏపీసీల నియమకాల జాబితాలో వెల్లడించింది. దాదాపు రెండేళ్లుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవల రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ జిల్లాల ఏపీసీల నియామకాల ప్రక్రియపై ప్రభుత్వం దృష్టి సారించింది. రామారావు ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలోని హార్టికల్చర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

ఘనంగా సాహితీవేత్త చాసో జయంతి



చాసో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు రవూఫ్

విజయనగరం అర్బన్: సాహితీవేత్త చాగంటి సోమయాజులు (చాసో) జయింతిని స్థానిక కుసుమగజపతినగర్‌లో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం శుక్రవారం ఘనంగా నిర్వహించింది. తొలుత ఆమన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చాసో రచనలు స్ఫూర్తిదాయకంగా ఉంటాయని కొనియాడారు. ఆయన రచనలు హిందీ, కన్నడ, మరాఠీ, మళయాళం, ఉర్దూ భాషల్లో చేసిన అనువాదాలు ప్రాచుర్యం పొందాయన్నారు. జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎస్‌రాజు, సీహెచ్.సాయిరెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పాచిపెంట: మండల కేంద్రంలోని సాలాపు వీధికి చెందిన వివాహిత సుంకరి నీలిమ(34) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, నీలిమ గురువారం రాత్రి తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుందని చెప్పారు. మృతురాలి తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నీలిమకు భర్త వెంకటరావుకు మధ్య తరచూ తగాదాలు జరుగుతున్న నేపథ్యంలో భర్త నుంచి ఆమె రెండేళ్ల క్రితం విడిపోయి రాయగడ వెళ్లిపోయింది. పెద్దలు రాజీ కుదర్చడంతో ఇటీవల రెండు నెలల క్రితం మళ్లీ భర్త వద్దకు వచ్చిందని ఎస్సై వివరించారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఈఎంటీ దహన సంస్కరణలకు రూ.10 వేల ఆర్థిక సాయం



రాంబాబు కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న 108 ఉద్యోగుల సంఘం నాయకులు

విజయనగరం ఫోర్ట్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఈఎంటీ రాంబాబు దహన సంస్కరణలకు 108 ఉద్యోగుల సంఘం తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. బాడంగి 108 అంబులెన్సులో ఈఎంటీగా పనిచేస్తున్న లోలుగు రాంబాబు, అతని భార్య, ఇద్దరు కుమారులతో కలిసి జియ్యమ్మవలస మండలంలోని అల్లువాడ నుంచి రామభద్రపురం వస్తుండగా పార్వతీపురం మండలం నర్సిపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంబాబు, అతని కుమారుడిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. శుక్రవారం రాంబాబు కుటుంబసభ్యులను 108 జోనల్ మేనేజర్ నజీర్ హుస్సేన్ మన్యం జిల్లా మేనేజర్ మన్మథనాయుడు, 108 ఉద్యోగుల సంఘం విశాఖపట్నం జిల్లా గౌరవ అధ్యక్షుడు బంగారురాజు, మన్యం జిల్లా అధ్యక్షుడు గొర్ల అప్పలనాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు వేమలి అప్పలనాయుడు పరామర్శించి దహన సంస్కరణలకు ఆర్థిక సాయం అందించారు.

ఉగాది నాటికి.. మారిక రోడ్డు పూర్తి చేయాలి

- కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్
- రహదారి నిర్మాణానికి రూ.7కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేసిన మారిక గిరిజనులు
- రోడ్డు నిర్మాణం వేగంగా పూర్తిచేయాలని వినతి

వేపాడ: దశాబ్దాల కాలంగా నెరవేరని మారిక గ్రామ గిరిజనుల సమస్యను రెండు నెలల్లో పరిష్కరించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ అన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి శుక్రవారం కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖరంపై నివసిస్తున్న మారిక రహదారి నిర్మాణాన్ని పరిశీలించారు. రోడ్డు ప్రాధాన్యంను ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, మండల స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోడ్డు నిర్మాణం నిధులపై ఆరాతీశారు. గతంలో ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన పథకంలో నిధులు మంజూరు కాగా 2 కి.మీ మేర తారురోడ్డు, కల్వర్టు పూర్తి కాగా మరో 4కి.మీ నిర్మాణానికి నిధులు ఉన్నట్లు రెండునెలల్లో రోడ్డునిర్మాణం పూర్తి చేస్తామని కలెక్టర్‌కు పీఆర్ ఎస్ఈ వివరించారు. అటవీ శాఖ అనుమతులూ ఉన్నాయని చెప్పారు.

ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ నిధుల మంజూరు చాలక రోడ్డు పనులు నిలిచిపోవడం, గిరిజనుల సమస్యలను, విద్యవైద్యం, రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి వారు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. దీంతో కలెక్టర్ స్పందించి మిగిలిన 5 కి.మీ.మేర రోడ్డు నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.ఏడు కోట్లు మంజూరు చేస్తామని ఉగాది నాటికి రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. దీంతో గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులతో పాటు కొంత దూరం కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు నడిచివెళ్లారు.



మారిక రోడ్డు అంశాన్ని అధికారులను అడిగితెలుసుకుంటున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

గిరిజనులకు డోలీ మోతలకు స్వస్తి చెప్పాలన్న లక్ష్యంతో కలెక్టర్ ఎస్.కోట నియోజకవర్గంలో మారిక రోడ్డుకు రూ.ఏడుకోట్లు, రేగ పుణ్యగిరి రోడ్డుకు నిధులు మంజూరు చేయడంపై స్థానిక నేతలతో పాటు గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేసి రాకపోకల కష్టాలు తొలగించాలని కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు సమష్టి బాధ్యతతో సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, పలువురు కూటమినేతలు, స్థానికులు, గిరిజనులు, నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రాములమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణ తదితర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేగ పుణ్యగిరికి కలెక్టర్ హామీలు

శృంగవరపుకోట: గిరిజనుల డోలీ కష్టాలకు చెక్ పెట్టాలని కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎస్.కోటలో పుణ్యగిరి గ్రామానికి స్థానిక ఎమ్మెల్యే లలితకుమారితో కలిసి వచ్చి పుణ్యగిరి వద్ద రేగపుణ్యగిరికి రోడ్డు వేయాల్సిన స్థలాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేగ పుణ్యగిరి వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ రేగపుణ్యగిరి వాసులకు డోలీ కష్టాలు లేకుండా చూడాలని, తాగునీరు, పోడు పట్టాలు, ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్‌ను కోరారు. గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ తక్షణం ఉపాధి హామీ పథకంలో రూ.2కోట్లతో రేగ పుణ్యగిరికి గ్రావెల్ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఉగాది నాటికి రేగపుణ్యగిరికి రోడ్డు, తాగునీరు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, అటవీశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు పని జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే చేసి పోడుపట్టాలు, పింఛన్లు, ఇళ్ల సమస్యలపై తనకు నివేదిక ఇవ్వాలని, ఆయా శాఖల ఉద్యోగులను ఆదేశించారు.



రేగపుణ్యగిరి వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్, ఎమ్మెల్యే లలితకుమారి తదితరులు

తడబడిన రెవెన్యూ ఉద్యోగులు

కలెక్టర్ అడిగిన ఒక్క ప్రశ్నకూ సరైన జవాబు చెప్పలేక రెవెన్యూ ఉద్యోగులు అవస్థలు పడ్డారు. రేగపుణ్యగిరిలో ఎంతమంది గిరిజనులకు పోడు పట్టాలిచ్చారు? ఎంత భూమి ఇచ్చారు ? ఎంత మంది అనుభవిస్తున్నారు? పట్టాలు లేకుండా ఎంతమంది ఎంత భూమి అనుభవిస్తున్నారు ? 42 కుటుంబాలు ఉంటే 47 రేషన్ కార్డులు ఎలా నడుస్తున్నాయి. దొంగ కార్డులు ఉన్నాయా ? 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామ జనాభా 527 అని నాకు రిపోర్ట్ ఇచ్చారు. రేగ పుణ్యగిరి జనాభా 127 అయితే ఇంత ఎందుకు చూపిస్తున్నారు. ఇక్కడి వీఆర్వో ఎవరు క్లారిటీ ఇవ్వండంటూ ప్రశ్నించినా రెవెన్యూ ఉద్యోగులు సరైన బదులివ్వలేదు. కలెక్టర్ వస్తారని రెండరోజుల ముందే తెలిసినా సరైన సమాచారంతో రెవెన్యూ సిబ్బంది సిద్ధం కావపోవడం శోచనీయం. కార్యక్రమంలో ఆర్డీవో డి.కీర్తి, డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, పీఆర్ ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ సతీష్, ఆర్‌డబ్ల్యూఎస్, హెల్త్, హౌసింగ్, ఫారెస్ట్ తదితర శాఖల ఉద్యోగులు హాజరయ్యారు.

భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజలు, సిబ్బంది భాగస్వామ్యంతోనే స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం విజయవంతం అవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెలలో మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నామన్నారు. కార్యక్రమానికి సంబంధించి విధివిధానాలను, మార్గదర్శకాలను విడుదల చేశామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, పురపాలకశాఖలు ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించాలని సూచించారు. చెత్త కుప్పల తొలగింపు, తాగునీటి వసతులు, క్లోరినేషన్, మురుగు కాలువలు శుభ్రం చేయడం, సామాజిక మరుగుదొడ్లను గుర్తించడం, ఉపయోగంలోకి తీసుకురావడం, దోమల నివారణకు చర్యలు చేపట్టడం, ఎన్ఆర్ఈజీఎస్‌లో చెరువులను అభివృద్ధి చేయడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు తదితర పనులు చేయాల్సి ఉందన్నారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 12 వరకు ఒక థీమ్‌తో కార్యక్రమాన్ని చేపట్టనున్నామని వివరించారు. కార్యక్రమంలో డీపీఓ టి.కొండలరావు, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి బి.రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గురుదేవ సేవలు అభినందనీయం



క్యాన్సర్ ఆసుపత్రి ఓపీ బ్లాక్‌ను ప్రారంభించిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి తదితరులు

శృంగవరపుకోట: గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అద్భుతం. ఆపన్నులకు ఆసరాగా నిలుస్తున్న గురుదేవ సంస్థ ఆదర్శం అని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో గల గురుదేవ చారిటబల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో నిర్మించిన డా.విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ హాస్పిటల్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, బీజేపీ నేత డా.ఎస్.మల్లారెడ్డి, ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, తదితరులు హాజరయ్యారు.

హామీలు నిలబెట్టుకోకుంటే ఉద్యమానికి సిద్ధం

- ఎస్‌టీయూ జిల్లా కమిటీ

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుంటే ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని ఎస్‌టీయూ జిల్లా కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు స్థానిక అమర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 2024 సాధారణ ఎన్నికల ప్రచార సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీలు నిలబెట్టుకోకుంటే ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతాలు మినహా మరి ఏ ఇతర ఆర్థికపరమైన లబ్ధిపొందలేదని సరెండర్ లీవులు, డీఏ అరియర్స్, పీఆర్‌సీ బకాయిలు, రెండు సంవత్సరాల నుంచి ఏపీజీఎల్ఐ పాలసీలు మెచ్యూర్ అయినప్పటికీ వాటి చెల్లింపులు మరిచారని ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ.32 వేల కోట్లు ఉండగా ఈ సంక్రాంతికి కేవలం 10 శాతం మాత్రమే చెల్లించారని మిగిలిన 90 శాతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు

తక్షణమే పదోన్నతులు చేపట్టాలి

12వ వేతన సవరణ సంఘానికి సంబంధించిన కమిషన్ ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికీ మొదలు పెట్టలేదని వ్యాఖ్యానించారు. మధ్యంతర భృతి 30 శాతానికి ప్రకటించకపోతే భావసారుప్య సంఘాలలో కలిసి ఉద్యమిస్తామని యాప్‌ల భారం తగ్గించాలని తక్షణమే పదోన్నతులు చేపట్టి బదిలీలకు సంబంధించి 8 అకడమిక్ సంవత్సరాల కాలపరిమితి మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడు కె.జోగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.మురళి, జిల్లా ఆర్థిక కార్యదర్శి బి.ఈశ్వరరావు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పి.రాంబాబు, కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, పి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

టూరిజం ప్రాంతాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలి

- ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు

పాలకొండ: టూరిజం ప్రాంతాల్లో ప్రజలకు రక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. సీతంపేట మండలంలోని అడలి వ్యూ పాయింట్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. టూరిజం ప్రాంతాలను ఏర్పాటు చేయడమే కాకుండా అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రక్షణ చర్యలు లేకుండా ఉంటే ఎలా? అని ప్రశ్నించారు. దీనిపై కమిషన్ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాశ్ రావులు ఉన్నారు.



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీవీజీ శంకరరావు, మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన

- మొదటి స్థానంలో నిలిచిన కేఎల్‌బీ పట్నం ఎడ్లు

వేపాడ: మండలంలోని వీలుపర్తిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రామదేవత నేరేళ్ల పైడితల్లమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో15 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. వాటిలో కేఎల్‌బీ పట్నంకు చెందిన బండారు హేమతేజ ఎడ్లు ప్రథమస్థానం, రెండో స్థానంలో అదనగిరికి చెందిన పరవాడ నాయుడు ఎడ్లు, మూడో స్థానంలో దేవరాపల్లికి చెందిన లక్ష్మీనరసింహా ఎడ్లు, నాల్గో స్థానంలో చుక్కపల్లికి చెందిన సామాలమ్మ ఎడ్లు, ఐదోస్థానంలో వావిలపాడుకు చెందిన చుక్కమాంబ ఎడ్లు నిలిచాయి. వారికి వరుసగా రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను సర్పంచ్ శానాపతి అప్పారావు లీలా దంపతులు తదితర కమిటీ సభ్యులు సహకారం అందించిన దాతల చేతుల మీదుగా అందజేశారు. అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించిన మొక్కులు చెల్లించుకున్నారు.



వీలుపర్తిలో ఎడ్ల పరుగు ప్రదర్శనలో పరుగుతీస్తున్న ఎడ్లు

బ్యాంకుల్లో సర్వీస్ చార్జీల బాదుడు

- ఏటిఎం కార్డులు, బ్యాంకు లావాదేవీలపై ట్యాక్స్
- జిల్లాలో ఉన్న బ్యాంకు ఖాతాదారులు సుమారు రూ.7.50 లక్షల మంది
- సర్వీస్ చార్జీల పేరుతో ఏటా రూ. 10 కోట్ల భారం
- బ్యాంకుల తీరుపై మండిపడుతున్న ఖాతాదారులు

వీరఘట్టం: ఇటీవల వీరఘట్టం మండలంలోని చిదిమి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వీరఘట్టంలోని ఓ బ్యాంకులో రూ.10 లక్షల కంటే అధికంగా లావాదేవీలు చేపట్టారు. అతనికి 2 శాతం టీడీఎస్ (ట్యాక్స్ డెబిట్ ఆఫ్ సోర్స్) కింద రూ.65 వేలు బ్యాంకు చార్జీలు పడ్డాయి. ఇదేమిటని ఆ వ్యక్తి నివ్వెరపోయాడు. బ్యాంకులో లావాదేవీలను పరిమితికి మించి చేసినా, ఏటీఎం కార్డులు 5 సార్లు కంటే ఎక్కువ వినియోగించినా ఖాతాదారుల ఖాతాలకు బాదుడు తప్పదు.

ఏటీఎం కార్డు వినియోగిస్తున్నారా? అయితే మీరు చేసే లావాదేవీలపై బ్యాంకులు సర్వీసు చార్జీలు గుంజుతున్నాయి. ఏటీఎం కార్డు వినియోగించినా, వినియోగించకపోయినా బాదుడు మాత్రం తప్పదు. స్టేట్ బ్యాంకు ఏటీఎంకు రూ.147.50 పైసలు, యూనియన్ బ్యాంకు ఏటీఎంకు రూ.108లు ఇలా వివిధ బ్యాంకులు తమ ఖాతాదారుల ఖాతాల నుంచి సర్వీసు చార్జీల పేరుతో రూ.కోట్లు గుంజుకుంటున్నాయి. ఈ విషయాన్ని సమీపంలో ఉన్న బ్యాంకుల వద్దకు వెళ్లి ఆరాతీయగా ఏటీఎం సర్వీస్ చార్జీల కింద కట్‌చేసినట్లు బ్యాంకు సిబ్బంది చెబుతుండడంతో చేసేదేమీలేక నివ్వెరపోయారు. అయితే ఇలా ఒక్కో ఖాతాదారు నుంచి సరాసరిన లెక్క వేస్తే జిల్లాలోని బ్యాంకు ఖతాదారుల నుంచి ఏడాదికి రూ.10 కోట్లు సర్వీస్ చార్జీల పేరిట బ్యాంకులు వసూలు చేస్తున్నాయి.వీటితో పాటు ఫోన్‌పే, పేటీఎం వంటి యూపీఐ సేవలపై కూడా ఆయా ప్రైవేట్ సంస్థలు బాదుడే బాదుడు అంటూ సర్వీస్ చార్జీలు వసూలు చేస్తున్నాయి.



బ్యాంకులో లావాదేవీలు చేస్తున్న ఖాతాదారులు



కనీస భద్రతలేని వీరఘట్టంలో ఉన్న ఓ ఏటీఎం సెంటర్

మన్యం ప్రజలపై రూ.10 కోట్ల భారం..

డ్వాక్రా రుణాలు, గ్యాస్ సబ్సిడీ ఇలా ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి వచ్చే రాయితీలు కావాలంటే ప్రతి వ్యక్తికి బ్యాంకు ఖాతా ఉండాలని అధికారులు చెబుతున్నారు. అలాగే చదువుకుంటున్న విద్యార్థులకు కూడా బ్యాంకు ఖాతాలు తప్పనిసరి. దీంతో ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఇలా జిల్లాలో 7.50 లక్షల మంది వివిధ బ్యాంకుల్లో ఖాతాదారులుగా ఉన్నారు. సర్వీస్ చార్జీల పేరుతో ఏడాదికి రూ.147.50 చొప్పున భారతీయ స్టేట్ బ్యాంకు, రూ.108లు చొప్పున యూనియన్ బ్యాంకు, ఇలా పలు బ్యాంకులు సర్వీసు చార్జీలు వసూలు చేస్తుండడంతో జిల్లాలోని వివిధ బ్యాంకుల ఖాతాదారులుగా ఉన్న మన్యం ప్రజలపై సుమారు రూ.10 కోట్ల భారం పడుతోందని గణాంకాలు చెబుతున్నాయి. బ్యాంకులు ప్రజలపై సర్వీసు చార్జీల పేరుతో బారం మోపుతుంటే ప్రభుత్వం కూడా ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో బ్యాంకు ఖాతాదారులు మండిపడుతున్నారు.

ఏటీఎంలలో కనీస వసతులు కరువు..

వాస్తవానికి ఏటీఎం సెంటర్లలో ఏసీలు ఉండాలి. ప్రతి లావాదేవికి సంబంధించిన కచ్చితమైన డేటా ఖాతాదారుకు తెలిసేలా స్లిప్ రావాలి. అయితే ప్రస్తుతం చాలా ఏటీఎం సెంటర్లలో కనీసం వసతులు కరువయ్యాయి. అయినప్పటికీ ఖాతాదారుల నుంచి సర్వీసు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను కూడా నియమించడం లేదు. రాత్రి పూట డబ్బులు విత్‌డ్రా చేయాలంటే ఖాతాదారులు భయపడుతున్నారు. ఇలా ఏటీఎం సెంటర్లలో డబ్బులు విత్‌డ్రా చేసే కొన్ని కేంద్రాల వద్ద భద్రత కొరవడింది. ఏటీఎం సెంటర్లలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి సర్వీస్ చార్జీలు వసూలు చేస్తే బాగుంటుందని ఖాతాదారులు అంటున్నారు.

అన్ని సేవలకు సర్వీస్ చార్జీలు కట్ అవుతున్నాయి



ఏటీఎం కార్డుతో ఆన్‌లైన్ ద్వారా చేసే ప్రతి లావాదేవీకి సర్వీసు చార్జీలు కట్ అవుతున్నాయి. మరి అలాంటప్పుడు మళ్లీ ఏడాదికోసారి సర్వీసు చార్జీలు వసూలు చేయడం సరికాదు.

– నల్లబిల్లి విశ్వేశ్వరరావు, వీరఘట్టం

అప్పులు ఎగ్గొటిన వారిని ఏమీచేయలేరు



రూ.వేల కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టిన వారిని ఏమీ చేయలేని బ్యాంకులు, ప్రభుత్వాలు సామాన్య ఖాతాదారులపై భారం మోపడం సమంజసం కాదు. ప్రభుత్వ అనుబంధ బ్యాంకులు కూడా ప్రైవేట్ బ్యాంకుల్లాగా వ్యవహరించడం పద్ధతి కాదు.

– ఎన్.తిరుమలరావు,వీరఘట్టం

రిజర్వ్ బ్యాంకు పరిధిలో ఉంటుంది

బ్యాంకింగ్ వ్యవస్థ రిజర్వ్ బ్యాంకు కంట్రోల్‌లో ఉంటుంది.సర్వీస్ చార్జీలు కూడా రిజర్వ్ బ్యాంకు అనుమతితోనే వసూలు చేస్తుంటారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఏటీఎం కేంద్రాల మెయింటనెన్స్‌కు ఖర్చు ఎక్కువవుతోంది. ఈ పరిస్థితుల్లో ఏటీఎంల మనుగడ కాపాడాలంటే సర్వీసు చార్జీలు వసూలు చేయక తప్పదు. ఈ విషయాలన్నీ ఖాతాదారులు గమనించాలి.

– విజయ్ స్వరూప్, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్

అప్రమత్తతతో సైబర్ మోసాలకు చెక్



హానీట్రాప్ షార్ట్ ఫిల్మ్ వీడియో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: మహిళల డీపీలు, వాయిస్, వీడియోలతో వచ్చే కాల్స్‌తో హానీట్రాప్‌లకు పాల్పడే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని, అటువంటి సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. హానీట్రాప్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్‌శాఖ రూపొందించిన హానీట్రాప్ షార్ట్ వీడియోను జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సైబర్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు జిల్లా పోలీస్‌శాఖ ప్రత్యేకంగా షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించిందన్నారు. హానీ ట్రాప్ పేరుతో కొందరు మహిళలు ప్రజలను ఉచ్చులోకి దింపేవిధానం, ఆయా మోసాల నుంచి బయటపడే పద్ధతులను షార్ట్ ఫిల్మ్‌లో పొందుపరిచామన్నారు. షార్ట్‌ఫిల్మ్‌ను సోషల్ మీడియా వేదికగా ప్రజలకు చేరవచేసి అప్రమత్తం చేస్తామన్నారు. సైబర్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ పోర్టల్‌కు, లేదంటే 1930కి ఫోన్ చేయాలన్నారు. షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందించిన విశాఖకు చెందిన మీడియా ఎఫెక్ట్స్ సభ్యులను, షార్ట్ ఫిల్మ్‌లో నటించిన పి.హరిని ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. షార్ట్ ఫిల్మ్ ఆవిష్కరణలో విజయనగరం రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్‌బీ సీఐలు ఎ.వి.లీలారావు, ఎఫెక్ట్స్ మీడియా యజమాని సంతోష్, హరి పాల్గొన్నారు.